క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

భూత్పూర్: రైతుబీమాకు వచ్చే నెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీధర్ అన్నారు. దరఖాస్తు ఫాంతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, తహసీల్దార్ డిజిటల్ సంతకం ఉన్న పేపర్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ పేపర్లతో పాటు సంబంధిత క్లస్టర్ ఏఈఓ సంతకం చేసి ఇవ్వాలన్నారు.

నిర్మాణం నిలిపివేయాలని ఉత్తర్వులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 12వ వార్డులో అనుమతి లేకుండా మొదటి అంతస్తు నిర్మాణం చేస్తున్న ఇంటి పనులు నిలిపివేయాలని హైకోర్టు న్యాయమూర్తి టి. వినోద్ ఉత్తర్వులు జారీ చేశారని న్యాయవాది టి. శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం విలేకరులకు తెలియజేశారు. గాంధీనగర్ ట్రస్టులో ఖయ్యూం అనే వ్యక్తి అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టడంతోపాటు.. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ప్రహరీని కూల్చివేసి పక్క ప్లాటును ఆక్రమించుకునేందుకు కుట్రలు పన్నుతున్నాడని హైకోర్టును ఆశ్రయించగా ఉత్తర్వులు వచ్చినట్లు వివరించారు. ఈ మేరకు నిలిపివేతపై కమిషనర్‌కు సూచిస్తూ.. ఏ చర్యలు తీసుకున్నారో రెండు వారాల్లో కోర్టుకు నివేదిక సమర్పించాలని ఆదేశించారని వెల్లడించారు. కాగా విషయంపై కమిషనర్ రాజయ్య స్పందిస్తూ నిర్మాణదారుడికి నోటీసు జారీచేసినట్లు వివరించారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పదో వార్డు పరిధిలోని క్రిస్టియన్‌పల్లిలో ఇళ్ల మధ్య ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కొన్ని నెలలుగా ఇందులో మిషన్ భగీరథ పథకం ద్వారా వచ్చే తాగునీటిని నింపకుండా ఖాళీగా ఉంచుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బాగా తడిసి పైభాగంలోని స్లాబ్ పడిపోయింది. దీంతో మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. దీనిపై పూర్తి నివేదిక అందజేయాలని ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. ఆ తర్వాతే కూల్చివేయాలా? లేదా? అనేది నిర్ణయించనున్నారు. అనంతరం 19వ వార్డు పరిధిలోని షాషాబ్‌గుట్ట తండాలో దెబ్బతిన్న రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయని..ఇందులో చదువుకునే పేద విద్యార్థుల కోసం కళాశాల స్థాయి హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి దమగ్నాపూర్‌లోని ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వివరించారు. జిల్లా కోశాధికారి శివకుమార్, నాయకులు శ్రావణ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, హోం నర్సింగ్‌లో ఉచిత శిక్షణ

స్టేషన్ మహబూబ్‌నగర్: కంప్యూటర్, హోమ్ నర్సింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తాజే దక్కన్ సొసైటీ అధ్యక్షుడు ఎండి.సలీం నవాబ్ తెలిపారు. జిల్లా కేంద్రం టీచర్స్‌కాలనీలోని తమ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 5 నుంచి శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 30 వరకు తమ కార్యాలయంలో ఆధార్‌కార్డు, పదోతరగతి సర్టిఫికెట్లు జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి గులాం గౌస్, సంయుక్త కార్యదర్శి మహ్మద్ మక్బూల్ పాల్గొన్నారు.

కొల్లూర్‌లో టీబీ శిబిరం

నవాబుపేట: కొల్లూర్‌లో మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధిపై అవగాహన కల్పించారు. మొదటి దశలో వ్యాధిని గుర్తిస్తే నిర్మూలించే అంశాలపై ప్రజలకు వివరించారు. 189 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్ఓ శ్రీనివాస్‌లు, శరభలింగం, బాల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, మంజుల, అనిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మహమ్మదాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు విజయానంద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బాల్‌రాజులను ఉపాధ్యాయబృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించి సన్మానించారు. రామిరెడ్డి, ముంతాజ్ హుస్సేన్, రాంలాల్, లక్ష్మీనారాయణ, రాజేశ్వర్, శీనయ్య పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరింపజేయాలని మంగళవారం ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డీటీ రాజీవ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం నాయకురాలు వసియాబేగం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడారు. కనీస సౌకర్యాలు కరువయ్యాయని విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. టాయిలెట్స్, స్నానపు గదులు వంటివి సరిగా లేవన్నారు. అలాగే స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరతను తీర్చాలని కోరారు. నాగలక్ష్మి, జ్యోతి, పాల్గొన్నారు.



రవీంద్రనగర్‌లో వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అమిస్తాపూర్‌లో ఊరేగింపులో పాల్గొన్న జనం



దేవరకద్రలో ఊరేగింపుగా వస్తున్న బోనాలు

బోనమెత్తిన పాలమూరు



రవీంద్రనగర్‌లో పోచమ్మ అమ్మవారు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఆయా పట్టణాలు, గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల వేడుక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలమూరు పట్టణంలోని రవీంద్రనగర్, పాతపాలమూర్, టీడీగుట్ట, వినాయకనగర్, న్యూమోతీనగర్, న్యూప్రేమ్‌నగర్, ఏనుగొండ, మర్లు, బీకేరెడ్డికాలనీతోపాటు పలు ప్రాంతాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. రవీంద్రనగర్‌లోని పోచమ్మదేవీ (శ్రీతలాదేవి) ఆలయం 34వ వార్షికోత్సవం, బోనాల వేడకల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. అధికారికంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. 46వ వార్డులో జరిగిన వేడుకల్లోనూ పాల్గొన్నారు. అదే విధంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రవీంద్రనగర్‌లో జరిగిన బోనాల వేడుకల్లో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

● హన్వాడ మండల పరిధిలోని వేపూర్, కొనగట్టుపల్లి, నాగినోనిపల్లి, లింగన్నపల్లి, తదితర గ్రామాల్లో మంగళవారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు.



పోచమ్మకు అంబలితో నైవేద్యం

దేవరకద్ర మండల కేంద్రంలో మంగళవారం బోనాల వేడుక వైభవంగా నిర్వహించారు. కుర్వ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు వందలాది మంది కుర్వ మహిళలు వెదురు గంపలో అంబలి నైవేద్యంతో ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మతల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం గొర్రెల కాపరులు తాము తెచ్చుకున్న పాత్రలలో సాకగా పోసిన అంబలిని నింపుకొని పరుగులు పెట్టారు. తమ గొర్రెల మందలపై చల్లారు. ఏటా ఆనవాయితీగా ఈ ఆచారం కొనసాగుతోంది. బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయనకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాగా సాయంత్రం బోనాల వేడుకలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. కురుమవాడ, తెలుగువాడ, దళితవాడల నుంచి వందలాది మంది మహిళలు బోనాలతో తరలి రావడంతో వేడుక కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు. చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల, చిన్నచింతకుంట, మద్దూర్, అల్లీపూరం, ఏదులాపూరం గ్రామాలల్లో మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.

● కోయిల్‌కొండ పరిధిలోని పారుపల్లి, మల్కాపూర్, బూర్గుపల్లి, కోత్లాబాద్, గ్రామాల్లో బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



జిల్లాకేంద్రంలో నృత్యం చేస్తున్న మహిళలు



పట్టువస్త్రాలతో ఊరేగింపుగా వస్తున్న పాలమూరు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు



బోనంతో యువతి



దేవరకద్రలో అంబలి సాక పోస్తున్న మహిళలు



వేపూర్‌లో..



రవీంద్రనగర్‌లో బోనాలతో మహిళల ప్రదక్షిణలు ..

అమిస్తాపూర్‌లో..

భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో మంగళవారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి అమ్మవారి దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన జోగినులతోపాటు పోతురాజుల విన్యాసాలు వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. గ్రామ పెద్దలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో ..



దేవరకద్రలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



అమిస్తాపూర్‌లో పోతురాజుల విన్యాసాలు



పారుపల్లిలో..

తొలిమెట్టుతో గుణాత్మక విద్య

జడ్చర్ల టౌన్: తొలిమెట్టు ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నామని ఏఎంఓ శ్రీనివాస్ స్పష్టం చేశారు. జాతీయ విద్యావిధానం 2020 4వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని తెలుగుమీడియం పాఠశాలలో సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు తరచూ పాఠశాలకు వచ్చి వారి పిల్లల ప్రగతి గురించి ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. ఎంఈఓ మంజులాదేవి, నోడల్ అధికారి జగదీశ్, ఆర్పీలు శేషసేనారెడ్డి, కృష్ణగౌడ్, హెచ్‌ఎం వనజ పాల్గొన్నారు.

హన్వాడ పాఠశాలలో మెడిసినల్ గార్డెన్

హన్వాడ: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెడిసినల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. స్కూల్ ఎర్త్‌క్లబ్- యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్ (వైఈఎల్‌పీ)లో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఔషధ మొక్కలను పాఠశాలలోని ఖాళీ ప్రదేశంలో నాటించారు. సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ విశ్వేశ్వర్‌రావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఔషధ మొక్కల ప్రాధాన్యతను వివరించారు. జీహెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

జడ్చర్ల టౌన్: సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ హెచ్చరించారు. మంగళవారం కమిషనర్ ఎస్.రాజయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఏళ్లుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. మున్సిపాలిటికీ పాలకవర్గం వచ్చిన తరువాత తమ సమస్యలు ఏమాత్రం పరిష్కారానికి నోచుకోవటం లేదని వాపోయారు. మహేష్, కేశవులు, విజయ్‌కుమార్, పాండు, కరీం, అంజమ్మ, దేవమ్మ, స్వరూప, పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/హన్వాడ : ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని.. అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగభద్రతతోపాటు పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంకట్‌నాయక్, వెంకటయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రద్దీగా మారిన బ్యాంకులు

భూత్పూర్: పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు రద్దీగా మారాయి. రైతులు రుణమాఫీ నేపథ్యంలో బ్యాంకుల వద్ద బారులు తీరారు. తమ రుణమాఫీకి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకోవడం ఇతరత్రా వాటి కోసం బ్యాంకుల వస్తున్నారు. కాగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 2500 మందికి పైగా రైతులకు రుణమాఫీ అయినట్లు తెలిసింది.



ఎస్‌బీఐలో క్యూలో నిల్చున్న రైతులు

భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్

మహబూబ్‌నగర్ క్రైం: శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్ ఎంతో ఉపయోగపడుతుందని వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పాత పాలమూరు నుంచి జిల్లా జైలు, గ్రంథాలయం, రాంమందిర్, క్లాక్‌టవర్ వరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న అధికారులు

వీసీని నియమించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో వైస్‌ఛాన్స్‌లర్‌ను వెంటనే నియమించాలని ఏబీవీపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈమేరకు నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిందాలను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తుందని అన్నారు. వీసీలను నియమించకపోతే యూనివర్సిటీలు అభివృద్ధి నిలిచి పోతుందన్నారు. వెంటనే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జైపాల్, బాలశివ, నీరేష్, కృష్ణ, వేణు, సతీష్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో నాగుపాము



కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీవీరభద్రస్వామి గర్భాలయంలో నాగుపాము దర్శనమిచ్చింది. మంగళవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచిన అర్చకులకు.. గర్భాలయం పై భాగంలో అమర్చిన కర్రకు పాము చుట్టుకొని పడగవిప్పి కనిపించింది. కొద్దిసమయం తరువాత బయటకు వెళ్లిపోయింది. నాగుపాము దర్శనమివ్వడం స్వామివారి మహాత్మ్యంగా భక్తులు చెబుతున్నారు. ఈమేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డా.కృష్ణ సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పట్టణాల పరిధిలో ఇంటింటికీ తిరిగి డెంగీ, మలేరియా, విషజ్వరాలు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎంఓ భాస్కర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్లు డి.మహేశ్వర్‌రెడ్డి, రాజయ్య, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిడ్జిల్: అంటు వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని డాక్టర్ శివకాంత్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

చిన్నచింతకుంట: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, అప్పంపల్లి సింగిల్‌విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలంలోని ఊకచెట్టు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించారు. బీఆర్‌ఎస్ హయంలో ఎలాంటి ప్రణాళిక లేకుండా డ్యాం నిర్మించారని ఆరోపించారు. దీంతో వరద నీరు గ్రామ సమీపంలోని శ్మశాన వాటికలోకి చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చేస్తున్నాడన్నారు.

పొలం పనులు చేస్తూ రైతుమృతి

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతు కరిగెటలో పడి మృతి చెందిన ఘటనతో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రైతు మల్కాపురం మల్లప్ప(56) గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నాడు. మంగళవారం తన సొంత వ్యవసాయ పొలంలో అంచులు తీస్తుండగా కరిగెటలో ఉన్న సమయంలోనే ఫిట్స్ వచ్చింది. దీంతో కరిగెటలో పడిపోయారు. చుట్టు పక్కల రైతులు గుర్తించే సరికే ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహాలు అయ్యాయి. మల్లప్ప భార్య పదేళ్ల క్రితం మృతిచెందారు.

డీసీఎం బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన డీసీఎం బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వెళ్తున్న సదరు డీసీఎం మంగళవారం జానంపేట చెరువు దాటిన తర్వాత అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. మధ్యాహ్నం తర్వాత ఎల్అండ్‌టీ సిబ్బంది క్రేన్ సాయంతో వాహనాన్ని పైకి తీశారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: గంగాపూర్‌నకి చెందిన గోల్కొండ పర్వతాలు(35) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. పర్వతాలు కొత్తగా ఇంటి నిర్మాణం చేశారు. ఇందుకోసం తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలన్న బెంగతో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం అతడి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

రైతులకు సూచనలు

నవాబుపేట: రుద్రారంలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో వివిధ పద్ధతులపై వివరించారు. ప్రధానంగా వరి సాగుపై రైతులకు సూచనలు చేశారు. ఏఈఓ తేజస్విని పాల్గొన్నారు.